
# పట్టెమంచం

-చందు సోంబాబు




చలిగా ఉంది. రాత్రి పన్నెండు కావస్తోంది. మంచం పైన నిద్ర పట్టక అవస్థ పడుతున్నారు రంగస్వామిగారు. ఆయనకి నిద్ర పట్టక పోవడం అన్నది చాలా కాలంగా జరుగుతున్నదే. ఆలస్యంగా నిద్ర పట్టడం, తొలి కోడి కూయందే మెలకువ రావడం ఆయనకి మామూలైపోయింది.

మంచానికి అంటి పెట్టుకొని పడుకోవాలని ప్రయత్నం చేసినా, ఆయన కోరికని మాత్రం ఆ మునలి పట్టె మంచం పడనివ్వదు.

రంగస్వామిగారు అరవయ్యో పడిలో పడ్డారు. రిటైరైన దగ్గర్నుంచి పని అయిన వ్యాపకం లేక జీవితం అంటే ఏదో బరువుగా భావించుకోవడం ప్రారంభించారు. ఆయన కున్న ఇద్దరు కొడుకులు, కోడళ్ళూ ఇంట్లోనే ఉంటారు. వాళ్ళతో కాలక్షేపం చేద్దామంటే వయసులో ఉన్నవాళ్ళు వాళ్ళు. తన చాదస్తం బొత్తిగా పనికిరాదు. రెండు మాటలు మాట్లాడేసరికి— "మీది వట్టి చాదస్తం, మామగారూ!" అంటారు.

పోనీ, మనమరాళ్ళతో ఆడుకొందామా అంటే ఆడే వయసు కాదు వాళ్ళది.

ఇంట్లో అందరూ పెందరాళే పడుకొంటారు. తిరిగి ఉదయం ఎనిమిదవుతుంది లేవడానికి.

రంగస్వామిగారు పైన రగ్గు కప్పుకొని చుట్ట వెలిగించి వరండాలోకి వచ్చారు. మసక వెన్నెల. మంచు విపరీతంగా కురుస్తోంది. అరుగుపైన కూర్చుని ఆలోచనలో పడిపోయారు.

తెల్లవారకట్ట తమ పిల్లల్ని లేపి చదివించేవారు. ఇప్పుడు వాళ్ళు తన మనమరాళ్ల విషయంలో అంత శ్రద్ధ ఎందుకు తీసుకోవడం లేదో అర్థం కాదు. చిన్నతనంనించీ బద్ధకం అలవాటు చేసి సోమరిపోతుల్ని చేస్తారేమో అని భయం ఆయనకి. అయినా ఆ పిల్లల వయస్సు ఎంతని? మూడు సంవత్సరాలే కదా? చదివే వయసు వస్తే అలవాటు చేస్తారేమో? ఎవరో రోడ్డుపైన గట్టిగా మాట్లాడుకొంటూ పోతున్నారు.

రెండో ఆట వదిలినట్టున్నారు. జనం మెల్లగా వస్తున్నారు.

ఆయన కా సమయంలో కూతురు సుగుణ గుర్తొచ్చింది. అది తనని రమ్మని ఉత్తరం వ్రాసింది. సంవత్సరమైపోయింది సుగుణని చూసి. వీలు చూసుకొని వెళ్ళాలి. సుగుణ కూతురు సీతకి తనంటే ప్రాణం. అల్లుడుకూడా మంచివాడే. కానీ ఆయన కొచ్చిన చిక్కల్లా ఒక్కటే—

"బాగున్నారా, మామగారూ!" అని అల్లుడూ, "అదేం, నాన్నా, అలా చిక్కిపోయావు? కదలకుండా విశ్రాంతి తీసుకోకూడదా— పెద్దవాడివి!" అని కూతురూ అంటారు. రంగస్వామిగారి కప్పుడు చాలా కోపం వస్తుంది. వయసు వచ్చినంత మాత్రం చేత తనెందుకూ పనికి రానట్టేనా? మూడు పూటలా తిని మంచ మెక్కి పడుకోమంటే తనేమయిపోవాలి?

సీత తన చేత కథలు చెప్పించుకొంటుంది. అవసరం తీరగానే— "తాతయ్య ముసలాడొచ్చి!" అని పారిపోతుంది. ఈసారి సీత తనని ముసలితాత అనంటే బుగ్గలు సాగతీసెయ్యాలి అనుకొన్నారు.

చుట్ట ఆరిపోయింది. తిరిగి వెలిగించారు. పొగ దట్టంగా వదులుతూ స్తంభానికి ఆనుకొని కూర్చున్నారు. లోపల ఏదో అలికిడి అయింది. కోడలో, కొడుకో మంచినీళ్లకి లేచి ఉంటారు అనుకొనేంతలోనే చిన్నబ్బాయి రామం బయటికొచ్చాడు. తండ్రిని చూస్తూనే—

"ఏమిటి, నాన్నా, ఇది? చలిలో బయట ఏం చేస్తున్నట్టు? అసలే మీ ఆరోగ్యం మంచిది కాదు" అన్నాడు.

రామం వంక కోపంగా చూశారు. ఏమీ అనలేక రామం వెంట లోపలికి నడిచారు.

చలిలో కూర్చుంటే ఆరోగ్యం పాడైపోతుందట— పెద్ద చెప్పొచ్చాడు! తన నందరూ పనికిరాని వాడిగా జమ కడుతున్నట్టనిపించింది. కారణం ఆయన కొక్కటే కనబడింది. కొడుకులూ, కోడళ్ళూ తన తోటివారు కాదు. తను ముసలివాడు. ఏం మాట్లాడినా చాదస్తం కింద జమ కడతారు.

ఈ ఇబ్బంది ఆయనకి మూడేళ్ల క్రితం వరకూ ఉండేది కాదు. మూడేళ్ల

క్రితం పోయిన తన భార్య జగదాంబ గుర్తు కొచ్చింది.

ముప్ఫై ఏళ్ల పైగా తనతో కాపరం చేసింది జగదాంబ. వయసులో కూడా దాదాపు తన కంటే పదేళ్లు చిన్నదే. అయినా, తన కంటె ముందే వెళ్లి పోయింది.

తీగలా తనని ఆధారంగా చేసుకొని అల్లుకుపోయి ఎప్పుడూ తన చెంతనే ఉండేది జగదాంబ. కష్టంలోనూ, సుఖంలోనూకూడా భాగం పంచుకొని యవ్వనపు రోజుల్నించీ వృద్ధాప్యం వచ్చే వరకూ పెనవేసుకొని పోయింది. పచ్చటి తీగ ఎండిపోయినా ఆధారమైన తన చుట్టూ ఆ తీగ జ్ఞాపకాలు మాసిపోలేదు.

తీగ ఎండిపోయింది. కానీ, ఆ తీగకి పూసిన పువ్వులు కళకళ లాడుతూ పచ్చగా ఉన్నాయి.

జగదాంబ ఉన్నప్పుడు పిల్లలు తన కెంతో దగ్గర వాళ్లలా అగుపించే వాళ్లు. అది పోయాక ఎందుచేతనో గానీ వాళ్లకీ, తనకీ మధ్య అనుబంధం తగ్గిందనుపిస్తూంది.


తెల్లవారకట్టు అయిదు గంటలకి పని మనిషి సత్తెమ్మ వస్తుంది. రంగస్వామి గారుకూడా ఆ వేళకి లేస్తారు గనక వెళ్లి బావి చప్టా పైన కూర్చుని సత్తెమ్మకి పనులు పురమాయిస్తుంటారు. గేదెలకి గడ్డి వేయించి కుడితి పెట్టాకగానీ సత్తెమ్మ మిగిలిన పనుల్లోకి రాదు.

ఇంకా పూర్తిగా తెల్లార లేదు. చప్టా పైన కూర్చుని చుట్ట కాలుస్తూన్న రంగస్వామిగారు ఉలిక్కిపడ్డారు. గడ్డివాము పక్కనించి పొగ వస్తూంది. ఆత్రంగా లేచి కర్ర చేత్తో పట్టుకొని వెళ్లారు. రంగస్వామిగారిని చూస్తూనే సత్తెమ్మ తప్పు చేసిన దానిలా—

"తప్పయినాది, బాబుగోరూ" అంది చేతిలో చుట్టని కింద పడేస్తూ. రంగస్వామిగారు నవ్వి, "ఫరవాలేదే. కాల్చుకో. నీకు అలవాటుందని తెలిస్తే నేనే ఇచ్చేవాడిని" అన్నారు అక్కడినించీ కదులుతూ. సత్తెమ్మ తన పనిలో పడిపోయింది.

సత్తెమ్మకి నలభై అయిదేళ్లుంటాయి. దేహదార్ఢ్యం గల మనిషి. నల్లగా నిగనిగలాడుతుంది మనిషి. ఇద్దరు పిల్లలూ, మొగుడూ ఉన్నారు. కానీ, అది అప్పుడప్పుడు డబ్బుకి కక్కుర్తి పడుతూ ఉంటుందని ఆయన విన్నారు. అయినా, అదెలా పోతే తన కెందుకు అనుకొన్నారు.

ఏడు దాటాక కోడళ్లు లేచి హడావిడిలో పడ్డారు, మొగుళ్లని ఉద్యోగాల్లోకి పంపడానికి.




పూవుని చూసి మురిసిపోకు
దానికీ ఉంది మరణం!
బాల్య, యౌవన
కౌమార, వృద్ధాప్యాల
వయఃపరిపాక సోపానం!

అరుణోదయంలోని అరుణ
కిరణాన్ని చూసి మురిసిపోకు
దానికీ తప్పదు అస్తమయం.

వెన్నెలని చూసి తనిసిపోకు
పదునైదు నాళ్ల ముచ్చటే అది.
భయంలా చీకటి
కాటుకలా రాతిరి!
దాన్ని వెన్నంటే వస్తుంది.

వయసు ఋతుధర్మంలాంటిది
ముసలితనం తనకు తానుగా
వచ్చి వరించక మానదు
వరాలను జడిపించకా పోదు!

మనిషి జీవిత రహస్యం
జాతస్య మరణం ధ్రువం!
ప్రాణి అన్న ప్రతిదానికీ
తప్పని జాతక రహస్యం!

వికసించిన పువ్వు
విచ్చుకొన్న మొగ్గ
కళ్లు విప్పిన పిల్లికూన
అంబా అనే లేగదూడ
గాలికి ఆడే కొమ్మ, రెమ్మ
వెలుగు, చీకటి, ఎండా, వానా, చలీ
అన్నిటికీ
పుట్టినినాడే నిర్ణయమై పోతుంది
జీవితంలోని ఆఖరి మజిలీ!

—ఎల్లోరా

పెద్ద కోడ లిచ్చిన కాఫీ తాగుతున్న రంగనాథంగారికి తన మంచం కోడు విరిగి ఉండడం కనుపించింది. అది చూసేసరికి ఆయన మనసు విలవిల్లాడి పోయింది.

అది ఆయన కొని చేయించినదైతే అంత బాధ పడేవారు కాదు.

అది జగదాంబ మంచం. దాని గుర్తుగా ఆ మంచంపైన తను పడుకొంటున్నారు. కాఫీగ్లాసు కింద పెట్టి మంచం దగ్గరి కెళ్లి కోడు పట్టి చూసుకొంటూంటే పెద్దాడు శంకరం వచ్చి, "ఎందుకు, నాన్నా, నీ కంత తపన? వెధవది— పాత మంచం అవతల పారేయ్. మీరు పడుకోవడానికి వేరే మంచమే లేనట్టు ఏమిటిది?" అన్నాడు.

రంగస్వామిగారు కొడుకు మాటలకి చాలా బాధ పడ్డారు.

"ఒరే, శంకరం, నా పంచ ప్రాణాలన్నీ ఈ మంచంలోనే ఉన్నాయిరా. ఇది మీ అమ్మ మంచంరా. ఈ మంచం మీదేరా మీ రంతా పుట్టింది! మీ అమ్మ గుర్తుగా నే నీ మంచం దాచుకొన్నాన్రా. ఒరేయ్! ఇది నీ కంత అడ్డంగా ఉందనుకొంటే పోనీ కనీసం నేను బతికున్నంత వరకన్నా అట్టే పెట్టరా!" అన్నారు. ముసలి మనిషి కళ్లలో నీరు చూసి శంకరం కంగారుపడ్డాడు. "అది కాదు, నాన్నా. . ." అని ఏదో చెప్పబోయి చెప్పలేక వెళ్లిపోయాడు. రంగస్వామిగారు కళ్లు తుడుచుకొంటూ అనుకొన్నారు—

'కొంత వయసు వచ్చేవరకే పిల్లలకి తల్లీ తండ్రీ కావాలి. ఆ తరవాత తను, తన పెళ్లాం, పిల్లలే కానీ, ముసలి తల్లీ, తండ్రీ ఎవరికీ అక్కర్లేదు. అందునా ఇప్పుడు అదికూడా లేదు. తను ఒంటరి మనిషి.'

తన నెవరూ పట్టించుకోవడం లేదనిపించింది. అవును మరి. తను వాళ్లకేమీ చెయ్యగలిగిన పరిస్థితిలో లేడు. అందుకే తనంటే బొత్తిగా లెక్క లేకుండా పోతూంది.

'కొంత కాలం సుగుణ దగ్గరికైనా పోతే బాగుండును' అనిపించింది.

( తరువాయి 39 వ పేజీలో )

# పట్టె మంచం

(35 వ పేజీ తరువాయి)

పది దాటుతుండగా రామకృష్ణయ్య గుర్తు కొచ్చాడు. రామకృష్ణయ్య ఆయనతోపాటే పని చేశాడు. తన తోటి మనిషి. రోజు మొత్తంమ్మీద ఓ గంట ఆయనతో గడపడం రంగస్వామిగారి కున్న అలవాట్లలో ఒకటి.

కొడుకుల భోజనం పూర్తయ్యాక తనూ ఇంత తిని బయలుదేరాడు. రామకృష్ణయ్య ఇంటిని చేరుతూనే స్థంభించి పోయారు రంగస్వామిగారు.

రామకృష్ణయ్య పోయాడు!

అత నలా అనుకోకుండా పోవడం తనని హెచ్చరించినట్లనిపించింది రంగస్వామిగారికి.

ఎప్పుడో ఒకప్పుడు చావక తప్పదు. కానీ, ఆ హెచ్చరికని మాత్రం ఆయన భరించలేకపోయారు.

ఈ రోజునించీ మరీ ఒంటరితనం తనని పీడిస్తుందని దిగులు చెందారు. ఇల్లు చేరుకున్నా, ఎవరితోనూ మాట్లాడా లనిగానీ, పలకరించాలనిగానీ లేదు ఆయనకి. అలవాటైన జీవితం. గడ్డుగా గడవని పగలూ, రాత్రీ. . .

రంగస్వామిగారికి ఆ క్షణంలో మాత్రం చచ్చిపోతే బాగుండుననిపించింది.

అవును. తను ఉండి మాత్రం చేసే దేముంది? కన్నందుకు కూతుర్ని ఓ దారి చేశాడు. కొడుకుల్ని ప్రయోజకుల్ని చేశారు. ఇంక తన కేవిధమైన బాధ్యతా లేదు.

ఉదయం ఆరవుతుంది.

రంగస్వామిగారు చప్టా పైన కూర్చుని సత్తెమ్మని చూసి నవ్వి పిలిచారు—"సత్తెమ్మా! ఇదుగోనే చుట్ట. తీసుకో" అని.

"నా కెందుకు, బాబయ్యా!" అంది.


"ఫర్వాలేదు. తీసుకో" అని అందిస్తుండగా అటు వచ్చిన చిన్న కోడలు చూసింది. రంగస్వామిగారు అదేమీ పెద్దగా పట్టించుకోలేదు. కానీ, చిన్న కోడలూ, పెద్ద కోడలూ కలిసి సూటీపోటీ మాటలు అనడం గ్రహించారు.

మనిషి మనసు మంచిది కాకపోతే తక్కువ ఆలోచనలే వస్తాయన్నది నిజం అనిపించింది.

తను చేసిందేమిటి?

పేదముండ అని జాలిపడి చుట్ట ఇవ్వడం పెద్ద నేరంగా భావించి లేని సంబంధాన్ని అంటగట్టింది కోడలు. తన నా వయసులో అల్లరి పెట్టడం భరించలేకపోయారు.

పెద్ద కొడుకు భోజనం చెయ్యకుండా వెళ్ళిపోయాడు. చిన్నవాడు భార్యని మందలించడం విన్నారు.



అక్షర స్మృతి

చిత్రం—శేషగిరిరావు (విజయవాడ)

పెద్దాడు ఎందుకని అలా వెళ్ళి పోయాడు? వాడుకూడా తనని అనుమానిస్తున్నాడా? రంగస్వామిగారికి బ్రతుకు చాలా భారంగా అనిపించింది.

పెద్ద ముండాకొడుకు నన్న జ్ఞానం కూడా లేకుండా తనకి రంకు కట్టిన చిన్న కోడలికి తన మనసులోని బాధని ఎలా చెప్పాలో తోచక ఆరాట పడి పోయారు. మంచం పైన పడుకొన్నారు. కోడలి ముఖం చూడాలంటే సిగ్గుగా ఉంది. నిజానికి కాని పనేదో చేసిన వాడిలా సిగ్గుపడ్డంకూడా ఆయన కిష్టం లేదు. నాలుగవుతుండగా బయటికి బయలు దేరారు. గాలికి తిరిగి తిరిగి ఏడవుతుండగా ఇల్లు చేరారు.

పెద్ద కొడుకూ, పెద్ద కోడలూ కలిసి కొత్త నవారు నేస్తున్నారు మంచానికి. ఆ రోజు ఒకటో తారీఖు అన్న సంగతి గుర్తు కొచ్చింది. వస్తున్న దగ్గు తెరని ఆపుకొంటు ఈజీఛెయిర్లో కూర్చున్నారు రంగస్వామిగారు. మంచానికి విరిగిన కోడుకూడా బాగుచేయించి ఉంది. ఉదయం నించి పడుతూన్న బాధ, కొడుకు చేసిన ఈ పనితో చాలా వరకు ఉపశమన మయింది.

"పెద్దాడా!" పిలిచారు.

"ఏం, నాన్నా?" శంకరం తండ్రి దగ్గరగా వచ్చాడు. "మీ అక్కయ్య నన్ను రమ్మని రాసింది కదరా? ఓసారి వెళ్లాలని ఉంది" అన్నారు.

శంకరం తండ్రి మొహంలోకి చూశాడు.

"ఇప్పు డెళ్లకపోతే ఏం, నాన్నా? అంత దూరం— పైగా ఒంటరిగా ఎలా వెళతారు?"

కొడుకు మాటలకి చాలా కోపం వచ్చింది.

"అవున్రా, అవును. నేను ఎక్కడికీ వెళ్లలేని పసివెధవని. అందుకే అందరూ న న్నిలా సాధిస్తున్నారు."

శంకరం నవ్వాడు.

"నిజమే, నాన్నా, ముసలితనం వచ్చాక మనుషులు పసిపిల్లలతో సమానమట" అని లోపలికి వెళ్ళిపోయాడు.

"నేను సుఖంగా బ్రతకడం మీ కెవ్వరికీ ఇష్టం ఉండదురా. నాకు తెలుసు. పైగా లేనిపోని మాటలు. నే నేదో అయిపోతానట. అయిపోతాను." గొణుక్కున్నారు.

రాత్రి పన్నెండయినా నిద్ర పట్ట లేదు.

లాభం లేదు. తనింక ఆ ఇంట్లో ఉండటం చాలా కష్టం. లేచి కొత్త నవారు అల్లిన తన జగదాంబ మంచాన్ని ఓ సారి తడిమి చూసుకొన్నారు.

'చూశావటే, జగం? నీ కోడలు నాకు పని చేసేదానితో సంబంధాన్ని అంట గట్టిందే! నే నెలాంటి వాడినో నీకు తెలీదటే? నీ ముద్దుల కొడుకులకీ నే నంటే బొత్తిగా పట్టడం లేదు. నీ కేం? నీ సుఖం నువ్వు చూసుకొని వెళ్లిపోయావ్. ఇక నేనూ ఇక్కడ ఉండ లేను. అమ్మాయ్ రమ్మని రాసింది. చివరి రోజులు దాని దగ్గరే గడిపేస్తాను' అంటూ మరోసారి మంచాన్ని తడిమి చూసుకొన్నారు.

సంచీ చేత్తో పట్టుకొని వీధిలోకి వచ్చారు రంగస్వామిగారు.

వరండాలో కూర్చుని ఉన్న కొడుకు లిద్దర్నీ చూసి కంగారు పడిపోయారు. రామం, శంకరం లేచి నించున్నారు.

"వెళ్లిపోతున్నావా, నాన్నా! నీదృష్టిలో మేం అంత పనికిమాలిన వాళ్లంగా కన బడితే వెళ్లిపో, నాన్నా! అమ్మ లేదు. ఆఖరికి నువ్వుకూడా ఇలా అన్యాయం చేసి వెళ్లిపోవాలనుకొన్నావా?" రామం మాటలకి ఏదో చెప్పాలని నోరు తెరవ బోయారు.

శంకరం అన్నాడు: "ను వ్వింత పని చేస్తావని తెలుసు, నాన్నా! అందుకే నేనూ, తమ్ముడూ ఇక్కడ కూర్చున్నాం. తెలిసీ తెలియని మనుషులు ఏదో అన్నారే చూడు— అంతలా బాధ పడాలా? నీ చేతుల్లో పెరిగిన వాళ్లం. నీ గురించి మాకు తెలీదా, నాన్నా? పద, నాన్నా, లోపలికి. పదండి. నువ్వనుకొంటున్నట్టు మేం రౌడీ వెధవలం కాదు, నాన్నా! ఈ ఒంట్లో ప్రవహించే ప్రతి రక్తపు బొట్టూ నీదే అన్న విషయం ఎప్పుడూ మరిచిపోము, నాన్నా!"

రంగస్వామిగారి కళ్లలో నీరు గిర్రున తిరిగింది.

"పదండిరా!" అని ఇద్దరు కొడుకుల బుజాలపైన చేతులుంచి లోపలికి నడిచారు.

తను వాళ్లని కన్న మనిషి. వాళ్లకి తనంటే ఎందుకు ఉండదు ప్రేమ? ఏదో భూతద్దాల్లోంచి చూసి తను బాధ పడతాడేగానీ, తన పిల్లల సంగతి తనకి తెలియదా?

మంచంపైన పడుకొన్నారు. కొత్తగా ఉంది ఆయనకి. తృప్తిగా కళ్ళు మూసు కొన్నారు. ఇప్పుడు ఇదివరలోలా నిద్ర పట్టక ఆయన అవస్థ పడలేదు. ఎప్పుడూ లేనంత సుఖంగా నిద్రలోకి జారిపోయారు.

రంగస్వామిగారికి ఆ నిద్రలో జగదాంబ, రామకృష్ణయ్య చిరునవ్వుతో తనని ఆహ్వానిస్తూ కనబడ్డారు. ★